

జగన్‌కు ఇవే చివరి ఎన్నికలు

కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

గూడూరు, మే 3: జగన్‌కు ఇవే చివరి ఎన్నికలని, వైసీపీకి ఓటమి తప్పదని కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో కర్నూలు జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి కర్నూలు టీడీపీ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరా జు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పోలింగ్ రోజు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. సొంత కుటుంబ సభ్యులే జగన్‌కు ఓటు వేయొద్దంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం సృష్టించబోతుందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుకుంద రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు, దండు సుందరరాజు, రేమట వెంకటేశ్వర్లు, మునగాల కుంటిచేతి గోపాల్, రామచంద్రుడు, బోయ హనుమంతు, అంజనేయులు, రవిప్రకాష్, షడ్రక్, అల్లిసా తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



మహిళలకు నమస్కారం చేస్తున్న బస్తిపాటి నాగరాజు

జూన్ 21న ఆర్‌యూలో స్నాతకోత్సవం

కర్నూలు(అర్బన్), మే 3: జూన్ 21న రాయలసీమ యూనివర్సిటీలో నాల్గవ స్నాతకోత్సవం (కాన్వకేషన్)నిర్వహిస్తున్నట్లు బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్నాతకోత్సవంపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. స్నాతకోత్సవ నిర్వహణకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తూ, సీనియర్ ఆధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాజ్‌భవన్ వర్గాలతో, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ స్నాతకోత్సవం ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెక్టార్ ఎన్‌కే నాయక్, రిజిస్ట్రార్ ఎస్. అంకన్న, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్ సుందరానంద పుచ్చా, సీ. విశ్వనాథరెడ్డి, ఆర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కర్నూలు(అర్బన్), మే 3: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 8 నుంచి ప్రారంభం కావాల్సిన 2, 4 సెమిస్టర్ పరీక్షలను ఈనెల 16కు వాయిదా వేసినట్లు ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేశామని, విషయాన్ని విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

వడదెబ్బ సోకి అన్నదమ్ముల మృతి



పెద్ద సుంకన్న(ఫైల్)



అంజనేయ (ఫైల్)

మంత్రాలయం, మే 3: కర్నూలు జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండలకు తోడు వడగాల్పులు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. శుక్రవారం మంత్రాలయంలో వడదెబ్బ సోకి అన్నదమ్ములు మృతి చెందారు. మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బోయ పెద్ద సుంకన్న (60), బోయ అంజనేయ (52) ఇద్దరు సోదరులు. వీరు రెండు రోజుల క్రితం ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యారు. పెద్ద సుంకన్న శుక్రవారం ఉదయం మృతి చెందగా.. తమ్ముడు అంజనేయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వెంటనే మృతి చెందాడు. ఇద్దరూ రెండు గంటల వ్యవధిలో చెందడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెద్ద సుంకన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అంజనేయకు భార్య నరసమ్మ, ఒక కొడుకు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద సుంకన్న అంత్యక్రియల అనంతరం అంజనేయ అంత్యక్రియలు నిర్వహించారు. వీరి కుటుంబాలను మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జంగం వీరన్న స్వామి, నాయకులు పైబావి నర్సిరెడ్డి, రాముడు, ఉమాకాంత్ రెడ్డి పరామర్శించారు.

రుద్రవరం: నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన పెద్దకుళ్లాయి (25) అనే యువకుడు వడదెబ్బ సోకి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు.

యువగళం సభకు తరలివచ్చిన యువత



ప్రసంగిస్తున్న నారా లోకేశ్

వైసీపీ తప్పుడు ప్రచారం

- ప్రజల కష్టాల నుంచి వచ్చిందే కూటమి మేనిఫెస్టో
- టీడీపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ
- జగన్ ఓటమి ఖాయమైంది
- కూటమి అభ్యర్థులను గెలిపించండి
- అసమర్థ సండే ఎమ్మెల్యేను సాగనంపండి
- నంద్యాల 'యువగళం'లో నారా లోకేశ్
- భారీగా తరలి వచ్చిన యువత





నంద్యాల (నూనెపల్లె), మే 3: టీడీపీ తీసుకొచ్చిన మేనిఫెస్టోపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఓటర్లు తిప్పికొట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ముస్లింలను పట్టించుకోలేదన్న వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. టీడీపీ మైనారిటీలకు అండగా ఉంటుందని, అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నంద్యాల పట్టణంలో శుక్రవారం యువగళం పేరుతో నారా లోకేశ్ యువతతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సభకు యువత వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఉద్యోగాలు అడుగుతున్న యువతకు గంజాయి అలవాటు చేసి ఒక తరాన్ని నాశనం చేస్తున్నాడన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది చాలక ప్రజల ఆస్తులను కొట్టేసేందుకు యత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. పోలవరాన్ని, అమరావతిని నాశనం చేశాడని, పేదలకు చంద్రబాబు టిడ్కో ఇళ్లు కడితే వాటిని జగన్ కూల్చేశాడన్నారు. కూటమిపై జగన్ నిందలు వేస్తున్నాడని, సీఏఏ, ఎన్నార్సీకి మద్దతునిచ్చిన జగన్ బయటకు వచ్చి టీడీపీ మైనారిటీలను ఇబ్బంది పెడుతుందని చెబుతున్నాడన్నారు. వాస్తవంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నంద్యాలలో సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆ ఘటన తనను కలచివేసిందన్నారు. గత ఐదేళ్లలో దళితులపై అంతులేని దాడులు పెరిగిపోయాయని చెప్పారు. నడిరోడ్డుపై కానిస్టేబుల్‌ను హత్య చేస్తే ఆ కుటుంబానికి ఇంత వరకు న్యాయం జరగలేదని గుర్తు చేశారు. రాయలసీమలో ఒక్క పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు.

యువతను ఆదుకుంటా

ఉద్యోగ నోటిఫికేషన్‌తో పాటు, పరిశ్రమలను తీసుకువచ్చి ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగాలను కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువతకు హామీనిచ్చారు. తాను యువగళం పాదయాత్రలో తిరిగినపుడు ప్రజల కష్టాలను చూసి వారి ఇబ్బందులను తీర్చేందుకు మేనిఫెస్టోను తీసుకువచ్చామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ముఖ్యంగా మెగా డీఎస్సీ విడుదల చేస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలను తీసుకువస్తామని, పరిశ్రమలను తీసుకువచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. 90 సబ్సిడీతో డ్రిప్, రెన్యూవల్ ఎనర్జీ, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్ది పాడిరైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడు హయాంలో ప్రతిరోజు పెట్టుబడులకు సంబంధించిన వార్తలు వచ్చేవన్నారు. ముఖ్యంగా ఓర్వకల్లులో విమానాశ్రయం, జైన్ ఇరిగేషన్, మెగా సీడ్ పార్కు, సోలార్ పవర్, ఉర్దూ యూనివర్సిటీ వంటి వాటిని తీసుకువచ్చాడని గుర్తు చేశారు. కానీ 22 మంది ఎంపీలను ఇస్తే జగన్ ఏం చేశాడని, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ అన్నాడు. కానీ ఈ ఐదేళ్లలో ఒక జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు.

సండే ఎమ్మెల్యేను సాగనంపండి

నంద్యాలలో పేదలకు పదమూడు వేల టిడ్కో గృహాలను టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిందని, అయితే అసమర్థ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వాటిని పూర్తిచేసి ఎందుకు పంపిణీచేయలేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరముందని ప్రశ్నించారు. నంద్యాలకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకరాని సండే ఎమ్మెల్యే ఎందుకని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను సాగనంపాలని పిలుపునిచ్చారు. ఇక శిల్పా రవి పాలనల నంద్యాల నియోజకవర్గంలో 15 హత్యలు జరిగాయని, ప్రశాంత నంద్యాల కోసం ఫరూక్‌ను గెలిపించాలని, అలాగే ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరికి ఓటు వేసి పార్లమెంటుకు పంపించాలని కోరారు. టీడీపీకి అధికారంలోకి వస్తే ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కల్తీ విత్తనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇస్తే సైకో జగన్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యం అయ్యాయని, టీడీపీ ప్రభుత్వం రాగానే వాటికి మరమ్మతులు చేసి గాడిన పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు బైరెడ్డి శబరి, ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, ముస్లింలు



నారా లోకేశ్ ప్రసంగాన్ని వింటున్న యువతీ, యువకులు



యువగళం సభలో యువతుల కేరింతలు



యువనేతను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న దృశ్యం



యువతీ, యువకులతో నారా లోకేశ్ సెల్ఫీ

తండ్రిని హతమార్చిన కుమారుడు?



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఓర్వకల్లు, మే 3: మద్యం తాగిన మైకంలో తండ్రిని హతమార్చిన ఘటన గురువారం రాత్రి ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుట్టపాడు గ్రామానికి చెందిన దర్గాలయ్య (50) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య సులోచన, కుమారుడు నాగశేషులు ఉన్నారు. గురువారం రాత్రి కుటుంబ కలహాలకు తోడు పింఛన్ డబ్బుకు సంబంధించి తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇద్దరూ మద్యం మత్తులో ఉండటంతో దుర్గాలయ్య కుమారుడిపై చేయి చేసుకున్నాడు. కోపోద్రిక్తుడైన కుమారుడు నాగశేషు తండ్రిపై పక్కనే ఉన్న కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో దుర్గాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే తన భర్త మద్యం మత్తులో కింద పడి మృతి చెందినట్లు భార్య సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు అనుమానం వచ్చి కుమారుడు నాగశేషును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి ఘటనపై విచారణ చేపడుతున్నారు.



జన కేతనం



బరిలో వీరు...



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మరో వారం రోజుల్లో ముఖ్యమైన ఘట్టం ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. వీరితో పాటు బరిలో తాము కూడా ఉన్నామంటూ స్వతంత్రులు తమ స్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. నంద్యాల లోక్‌సభ స్థానానికి 31 మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 140 మంది పోటీలో మిగిలారు. అత్యధికంగా నంద్యాల, బనగానపల్లె అసెంబ్లీ నుంచి 28 మంది చొప్పున పోటీలో ఉన్నారు. ఇక నందికొట్కూరు(ఎస్సీ) సెగ్మెంట్ నుంచి 18, ఆత్మకూరులో 18, ఆళ్లగడ్డ లో18, డోన్‌లో 16, పాణ్యంలో 14 మంది చొప్పున పోటీలో వున్నారు. మొత్తంగా ప్రధాన రాజకీయ పక్షాలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే.

- నంద్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి)

నంద్యాల (ఎంపీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 18 బీఎస్పీ: చిన్న మౌలాలి ఎస్‌డీపీఐ : హఫీజ్ అతావుల్లా ఖాన్ ఇతర పార్టీలు : 8
బైరెడ్డి శబరి	పోచా బ్రహ్మానందరెడ్డి	లక్ష్మీ నరసింహ యాదవ్	మొత్తం : 31

నంద్యాల (అసెంబ్లీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 12 బీఎస్పీ: వెంకటరమణ ఎస్‌డీపీఐ : షేక్ మహ్మద్ ఫాజిల్ ఇతర పార్టీలు : 11
ఎన్ఎండీ ఫరూక్	శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి	గోకుల్ కృష్ణారెడ్డి	మొత్తం : 28

నందికొట్కూరు (ఎస్సీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 4 బీఎస్పీ : గద్దల లాజర్ జైభారత్ నేషనల్ పార్టీ : బోరెల్లి వెంకటరాముడు ఇతర పార్టీలు : 9
గిత్తా జయసూర్య	ధారా సుధీర్	తోగూరు ఆర్థర్	మొత్తం : 18

శ్రీశైలం

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 5 బీఎస్పీ: పల్లె చంద్రశేఖర్ ఎస్‌డీపీఐ: యూనస్ ఇతర పార్టీలు: 8
బుడ్డా రాజశేఖర్ రెడ్డి	శిల్పా చక్రపాణి రెడ్డి	ఏఎస్ ఇస్మాయిల్	మొత్తం : 18

పాణ్యం

టీడీపీ	వైసీపీ	సీపీఐ(ఎం)	ఇతరులు
			స్వతంత్రులు : 2 బీఎస్పీ: రామశేషయ్య అన్న వైఎస్సార్ పార్టీ : హరుణ్ జైభారత్ నేషనల్ పార్టీ : రఘురామిరెడ్డి ఇతర పార్టీలు : 6
గౌరు చరితా రెడ్డి	కాటసాని రాంభూపాల్ రెడ్డి	గౌస్ దేశాయ్	మొత్తం : 14

ఆళ్లగడ్డ

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 7 బీఎస్పీ: వరికూటి హన్నమ్మ ఇతర పార్టీలు : 7
భూమా అఖిలప్రియ	గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి	బరగొడ్ల హుసేన్ బాషా	మొత్తం : 18

బనగానపల్లె

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 22 బీఎస్పీ : జి.చిన్నయ్య ఇతర పార్టీలు : 2
బీసీ జనార్దన్ రెడ్డి	కాటసాని రామిరెడ్డి	గూటం పుల్లయ్య	మొత్తం : 28

డోన్


టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
			స్వతంత్రులు : 10 బీఎస్పీ : రుద్రవరం రాముడు ఇతర పార్టీలు : 10
కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి	బుగ్గన రాజేంద్రనాథ్	గార్లపాటి మద్దిలేటి	మొత్తం : 16

ఎవరడిగినా మా ఓటు మీకే..!



నందికొట్కూరు/చాగలమర్రి, మే 3: ఎన్నికల వేళ విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయంపై ప్రత్యర్థి నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచాడు. కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే బాబు అని సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. గత ఎన్నికల వరకూ లేని ఈ విచిత్ర పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో నెలకొనడంతో ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెప్పవచ్చు. ఇటువంటి జాబితాలో ప్రస్తుతం పురుషులతో పాటు మహిళలు కూడా చేరిపోయారు. ఇప్పటికే పట్టణంతోపాటు గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. అభ్యర్థులు పర్యటిస్తున్న సమయంలో ఘనంగా ఆహ్వానం పలకాలనే ఉద్దేశంతో స్థానిక నాయకులు ముందు రోజే ఇంటింటికీ వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఆహ్వానాన్ని మన్నించిన కొందరు నాయకుల ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రచారంలో తిరిగే వారి వల్ల లోలోపల ఆందోళన చెందుతున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలదేముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం అంత వరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డ కాకుండా ఉండకూడదు కదా అని సమాధానాలు చెబుతున్నారు. దీంతో రాజకీయ పార్టీ నేతలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఖైదీలకు కూడా ఓటు హక్కు..!!



ఖైదీలకు కూడా ఓటు హక్కు ఉంది. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. తమ ఓటు ఉన్న నియోజకవర్గం పేరును సూచిస్తూ ఓటర్లమని గుర్తింపు పొందుపరుస్తూ, పోలింగ్ బూత్, ఓటరు క్రమ సంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా సదరు జైళ్ల అధికారులను కోరాలి. ఖైదీలు ఏ నియోజకవర్గంలో ఓటరుగా ఉంటారో ఆయా నియోజకవర్గాల నుంచి పోస్టల్ బ్యాలెట్లను తెప్పించి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.


- నంద్యాల టౌన్

ఓటు వేసి ఉంటే ఒట్టు

ఆ ఇద్దరి నాయకుల గుప్పిట్లో పది గ్రామాలు




బనగానపల్లె, మే 3 : ఫ్యాక్షన్ నాయకులు రాజకీయాల్లోకి ప్రవేశించడంతో నాలుగు దశాబ్దాలుగా ఆ గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే మరిచిపోయారు. ఆ గ్రామ పెత్తందారులు, ఫ్యాక్షన్ నాయకులు చెప్పిందే ఆ గ్రామాల్లో వేదం. గెలుపు ఓటములను నిర్ణయించేది అత్యధిక ఓట్లు ఉన్న బనగానపల్లె మండలమే. తర్వాత స్థానంలో అవుకు మండలం ఉంటుంది. అయితే అవుకు మండలంలోని పలు గ్రామాలు నాయకుల గుప్పిట్లో ఉండిపోయాయి. అవుకు మండలంలోని గుండ్ల శింగవరం, అన్నవరం, గడ్డమేకలపల్లె, కొట్టాల, కోనాపురం, లింగంబోడు, నిచ్చెనమెట్ల గ్రామాలు కాటసాని కుటుంబీకుల ఆధ్వర్యంలో పని చేస్తున్నాయి. అలాగే ఉప్పలపాడు, కొండమనాయునిపల్లె, జూనూతల, పిక్కిళ్లపల్లె తండా, మారెమడుగుల గ్రామాలు చల్లా వర్గీయుల ఆధిపత్యంలో నడుస్తున్నాయి. ఈ గ్రామాల్లో ఎన్నికలు ఏకచత్రాధిపత్యంగా జరుగుతున్నాయి. ఇక్కడి ప్రజలకు ఓటు వేయడమనేదే తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆ గ్రామ పెత్తందారుల అనుచరులు గతంలో ఎన్నికల బూత్ వద్దకు వెళ్లి ఎవ్వరినీ రానివ్వకుండా రిగ్గింగ్ చేసే వారు. ప్రస్తుతం ఈవీఎంలు రావడంతో రీసైక్లింగ్ చేస్తున్నారు. ఓటు వేసిన వారే వచ్చి మళ్లీ మళ్లీ వేసి పోతుంటారు. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లో కూర్చోనివ్వరు. ఒకవేళ కూర్చున్నా బలవంతంగా పోలింగ్ కేంద్రం నుంచి బయటకు లాగి పడేస్తారు. సుమారు 9 వేలకు పైగా ఓట్లను అవుకు మండలంలో రిగ్గింగ్ చేసుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా ఎన్నికలు జరుపుతున్నామని చెబుతున్నా ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. అవుకు మండలంలోని ఉప్పలపాడు, జూనుంతల, పిక్కిళ్లపల్లె తండా, మారెమడుగుల, కొండమనాయినిపల్లె గుండ్ల శింగవరం, నిచ్చెనమెట్ల, కోనాపురం, రామవరం, లింగంబోడు, గోకుల దిన్నె, అన్నవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 9,332 మంది ఓటర్లు ఉన్నారు. ఇవన్నీ గంపగుత్తగా ఒకే పార్టీకి వేసుకోవడం సర్వసాధారణమైపోయింది.



పోలింగ్ అధికారులను భయపెట్టి..

ఈ గ్రామాల్లో పోలింగ్ విధులకు హాజరయ్యే ఎన్నికల అధికారులు ముందు రోజే ఎన్నికల సామగ్రితో గ్రామాలకు చేరుతారు. దీంతో ఆయా గ్రామ పెత్తందార్లు వార్లను ముందుగానే బెదిరించే కార్యక్రమాలు పూర్తి చేస్తారు. తమకు అడ్డువస్తే చంపేస్తామని హెచ్చరిస్తారు. దీంతో పోలింగ్ అధికారులు కిమ్మనే వారు కాదు. ఈవిషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి కూడా తీసుకువెళ్లకుండా అంతా సజావుగా జరిగినట్లు పోలింగ్ అధికారులకు నివేదికలు అందించేవారు. ఇక్కడ రీసైక్లింగ్, రిగ్గింగ్ జరుగుతుందని ఉన్నతాధికారులకు తెలిసినా వారు ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నది లేదు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అందరూ ఓటు వేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



హలో...నన్ను గుర్తుపట్టారా..

కల్లూరు, మే 3: ఓటరు దేవుళ్లకు నమస్కారం..మీకోసం మళ్లీ వచ్చాను..నన్ను గర్తుపట్టారా..నేనేనండీ ఈవీఎంని...మళ్లీ మీ ముందుకు వస్తున్నాను. నేను ఎలా ఉపయోగపడతానో ఇప్పటికే అధికారులు చేప్పే ఉంటారు.. మీరు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నారో అతని పేరును బాగా పరిశీలించండి. ఓ నిర్ణయానికి వచ్చాక మీరు ఓటు వేయండి. మీ ఓటును మీరే వేయండి.. ఇతరులకు అవకాశం ఇవ్వవద్దు. మీరు మీటనొక్కినప్పుడు కీ శబ్దం వస్తుంది. అలా శబ్దం వస్తేనే ఓటు వేసినట్లు సరేనా..ఉండనా మరి...బాగా గుర్తుంచుకోండి. ఇట్లు మీ ఈవీఎం.

అదనపు బ్యాలెట్ యూనిట్లు కేటాయింపు

కర్నూలు(కలెక్టరేట్), మే 3: కర్నూలు పార్లమెంటు స్థానానికి సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ద్వారా అదనపు బ్యాలెట్ యూనిట్ కేటాయింపు ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 16 కంటే (నోటాతో కలిపి) ఎక్కువ మంది అభ్యర్థులు కర్నూలు పార్లమెంటు స్థానాలకు పోటీల్లో ఉండడం వల్ల అదనపు (రెండవ) బ్యాలెట్ యూనిట్లు జిల్లాకు రావడం జరిగిందన్నారు. బ్యాలెట్ యూనిట్లు బెల్ ఇంజనీర్లు ఫస్ట్ లెవల్ చెక్ పూర్తి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీపీవో నాగరాజు నాయుడు, బీజేపీ ప్రతినిధి సాయిప్రదీప్, టీడీపీ ప్రతినిధి ఎల్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న అభ్యర్థుల ఖర్చు



కర్నూలు(కలెక్టరేట్), మే 3: మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో లోకసభ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.25వేల వరకు ఖర్చు చేయడానికి అనుమతించారు. కొన్ని ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పరిమితి రూ.10వేలు మాత్రమే. 1971 సంవత్సరంలో వ్యయ పరిమితి దాదాపు అన్ని రాష్ట్రాల్లో రూ.35 వేలకు పెరిగింది. 1996 సంవత్సరంలో ఒక్కో అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.4.5 లక్షలకు చేరింది. 1998 సంవత్సరంలో రూ.15 లక్షలకు పెంచారు. 2004 సంవత్సరంలో రూ.25 లక్షలకు పెంచారు. 2014లో లోక్‌సభ అభ్యర్థులు గరిష్ఠ వ్యయ పరిమితిని రూ.70 లక్షలుగా నిర్ణయించారు. 2024 సంవత్సరంలో పెద్ద రాష్ట్రాలకు రూ.95 లక్షలకు చిన్న రాష్ట్రాలకు రూ.75 లక్షలకు చేరింది. 2019 సంవత్సరంలో ఎన్నికల్లో అన్ని పార్టీలకు కలిపి దాదాపు రూ.50వేల కోట్ల ఖర్చు చేసినట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో 401 స్థానాలకు 53 పార్టీల నుంచి 1,874 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అప్పట్లో ఈసీ 1.96 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల్లో 543 లోక్‌సభ స్థానాలకు 673 పార్టీల నుంచి ఎనిమిది వేల మందికి పైగా అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల కోసం పది లక్షలకుపైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయి. 2024 ఎన్నికల్లో రాజకీయ పార్టీల సంఖ్య దాదాపుగా 2,500కు పెరిగింది. పోటీ చేసే పార్టీలు, అభ్యర్థుల సంఖ్య పెరిగే కొద్ది ఎన్నికల వ్యయం అధికమవుతోంది. 1951-52 సంవత్సరంలో మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలకైన వ్యయం రూ.10.45 కోట్లు, 2014 సంవత్సరంలో 16వ సార్వత్రిక ఎన్నికల నాటికి అది రూ.3,800 కోట్లకు మించిపోయింది. 2019 సంవత్సరంలో ఎన్నికల ఖర్చు రూ.55వేల కోట్లకు చేరింది. 2024 సంవత్సరం ఎన్నికల వ్యయం రూ.లక్ష కోట్లు దాటిపోతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఎన్నికల ఖర్చు ఇదే..!



చెరుకుబండి వద్ద చెరుకు రసం తీస్తున్న భరత్

ఎన్నికల వేళ...

ఎన్నికల వేల రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారపర్వంలో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా ప్రజాక్షేత్రంలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి టీజీ భరత్ నగరంలోని ఎన్ఆర్‌పేటలో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ వారి కష్టాలను తెలుసుకున్నారు. వారితో మమేకమై ఓ చోట చెరుకుబండి వద్ద చెరుకు రసం తీశారు. మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు వెళ్లి కాసేపు నూడిల్స్ వేశారు. ఇలా తనదైన శైలిలో ప్రజలను ఆకట్టుకుంటున్నారు.


-కర్నూలు అర్బన్



ఎన్ఆర్ పేటలో నూడిల్స్ వేస్తూ...



పాణ్యం మండలం సుగాలిమెట్ట తండాలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గౌరు చరిత



జన కేతనం

అభ్యర్థులు వీరే..


మరో వారం రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ జరగనుంది. మే 13వ తేదీన జరిగే ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఈవీఎం యంత్రాలు, ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రం చేశారు. సమయం తక్కువగా ఉన్నందున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. వీరితో పాటు బరిలో తాము కూడా ఉన్నామంటూ స్వతంత్రులు తమ స్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కర్నూలు లోక్‌సభ స్థానానికి 19 మంది బరిలో నిలిచారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు 88 మంది పోటీలో మిగిలారు. అత్యధికంగా కర్నూలు అసెంబ్లీ నుంచి 25 మంది పోటీలో ఉండగా అత్యల్పంగా మంత్రాలయం నుంచి కేవలం 8 మంది మాత్రమే బరిలో నిలిచారు. అదేవిధంగా ఆలూరు నుంచి 12 మంది, ఆదోనిలో 10, కోడుమూరు (ఎస్సీ) 14, పత్తికొండలో 9, ఎమ్మిగనూరులో 10 మంది చొప్పున మంది పోటీలో ఉన్నారు. ప్రధాన రాజకీయ పక్షాలైన టీడీపీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే.

మంత్రాలయం రాఘవేంద్రులు

మంత్రాలయం నియోజకవర్గంలో బరిలో ఉన్నది కేవలం 8 మంది మాత్రమే వీరిలో టీడీపీ అభ్యర్థి ఎన్. రాఘవేంద్రరెడ్డి పేరును పోలిన మరో ఇద్దరు కూడా బరిలో ఉన్నారు. జాతీయ జనసేన పార్టీ (జేజేపీ) నుంచి ఆర్. రాఘవేంద్ర రెడ్డి బరిలో ఉండగా, స్వతంత్ర అభ్యర్థిగా ఎం. రాఘవేంద్ర రెడ్డి పోటీలో ఉన్నారు.

- కర్నూలు, మే 3 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు (ఎంపీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బస్తిపాటి నాగరాజు	బీవై రామయ్య	రాంపుల్లయ్య యాదవ్	స్వతంత్రులు : 8 బీఎస్పీ: లక్ష్మీనారాయణ జైభారత్ నేషనల్ పార్టీ : శ్రీధర్ బీసీవై : శ్రీధర్ ఇతర పార్టీలు : 5 మొత్తం : 19

కర్నూలు (అసెంబ్లీ)




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
టీజీ భరత్	ఏఎండీ ఇంతియాజ్	షేక్ జిలానీ బాషా	స్వతంత్రులు : 15 బీఎస్పీ: అరుణ్‌కుమార్ అన్నా వైఎస్సార్ పార్టీ : అబ్దుల్ సత్తార్ ఇతర పార్టీలు : 5 మొత్తం : 25

మంత్రాలయం



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
ఎన్.రాఘవేంద్ర రెడ్డి	వై.బాలనాగి రెడ్డి	మురళీకృష్ణ రాజు	స్వతంత్రులు : 3 బీఎస్పీ : జి.శామ్యుల్ జేజేపీ: రాఘవేంద్ర రెడ్డి మొత్తం : 8

ఆలూరు




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
వీరభద్రగౌడ్	బి. విరూపాక్షి	అరికట్ల నవీన్ కిశోర్	స్వతంత్రులు : 6 బీఎస్పీ : రామలింగ బీసీవై: మోహన్ ప్రసాద్ బీఎస్పీ: షేక్షావలి మొత్తం : 12

ఎమ్మిగనూరు




టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బీవీ జయనాగేశ్వర రెడ్డి	బుట్టా రేణుక	కాశీంవలి	స్వతంత్రులు : 5 బీఎస్పీ : కప్పటి రాఘవేంద్ర జాతీయ జనసేన పార్టీ: నాగార్జున రెడ్డి మొత్తం : 10

కోడుమూరు (ఎస్సీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బొగ్గుల దస్తగిరి	ఆదిమూలపు సతీష్	పరిగెల మురళీకృష్ణ	స్వతంత్రులు : 10 బీఎస్పీ: జయరాజు మొత్తం : 14

పత్తికొండ



టీడీపీ	వైసీపీ	సీపీఐ	ఇతరులు
కేఈ శ్యాంబాబు	కంగాటి శ్రీదేవి	రామచంద్రయ్య	స్వతంత్రులు : 3 బీఎస్పీ : రాజేష్ నాయకల్లు ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ : మంకె వెంకటేష్ నేషనల్ క్రాంతి పార్టీ : వాల్మీకి పెద్దయ్య మొత్తం : 9

ఆదోని



బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
డాక్టర్ పార్థసారథి	వై.సాయిప్రసాద్ రెడ్డి	రమేష్ యాదవ్	స్వతంత్రులు : 5 బీఎస్పీ: ఆసియాబాను జైభీమ్‌రావు భారత్ పార్టీ : కె.రంగన్న మొత్తం : 10




ఆదోనిలో అతి కష్టం మీద కాళ్లకు చెప్పులు లేకుండా నడిరోడ్డుపై నడుచుకుంటూ బ్యాంకుకు వస్తున్న వృద్ధురాలు బోయ నరసమ్మ (80)

ఓట్ల వేటలో జగన్నాటకం..!

- వేసవిలో పింఛన్‌దారులపై కక్ష సాధింపు
- వెసులుబాటు ఉన్నా ఇళ్ల వద్ద పంపిణీ చేయని వైనం
- వైసీపీ కుట్రలకు వృద్ధుల అగచాటు
- టీడీపీపై నెపం నెట్టి లబ్ధి పొందాలనే దురాలోచన





ఎవరిదీ పాపం..!

వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జనం అల్లాడిపోతున్నారు. యువత సైతం ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతోంది. అత్యవసరమై బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండుటెండలో పండుటాకులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం పండుటాకులకు ఇంటి వద్దే పింఛను ఇవ్వాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ వృద్ధులను ఇబ్బందులకు గురి చేస్తోంది. మొన్న పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ తిప్పి ఇబ్బందులకు గురి చేసింది. అది సరిపోలేదని ఈసారి ఏకంగా కిలోమీటర్ల దూరం వెళ్లి బ్యాంకుల నుంచి పింఛను తెచ్చుకునేలా చేసింది. గత నెల కంటే ఈసారి వారి కష్టాలు రెట్టింపు అయ్యాయి. సచివాలయాల ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పింఛను ఇచ్చే వెసులుబాటు ఉన్నా ఏప్రిల్‌లో ప్రభుత్వం లబ్ధిదారులను కష్టపెట్టింది. సకాలంలో నగదు ఇవ్వక పోవడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందడానికి ఇలాంటి పన్నాగాలు చేస్తోంది.

కర్నూలు న్యూసిటీ/ ఆదోని అగ్రికల్చర్/ ఓర్వకల్లు / ఆదోని రూరల్ /ఆలూరు/చాగలమర్రి/పాములపాడు, మే 3:

పింఛన్ కోసం వెళ్లి సొమ్మసిల్లిన వృద్ధురాలు



వెల్దుర్తి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు షేక్ మలాన్ బీ

వెల్దుర్తి, మే, 3 : పింఛన్‌దారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. గత నెల సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్లను పంపిణీ చేసింది. అయితే మే నెల మాత్రం బ్యాంకుల వద్దకు వెళ్లి పింఛన్లు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో లబ్ధిదారుల కష్టాలు మొదలయ్యాయి. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు పింఛన్ కోసం మండుటెండలో వెళ్లి బ్యాంకులో సొమ్మసిల్లిపడిపోయింది. వెల్దుర్తిలోని 8వ వార్డులో నివాసం ఉంటున్న షేక్ మలాన్ బీ పింఛన్ తీసుకోవడానికి శుక్రవారం స్టేట్ బ్యాంకుకు వెళ్లింది. లావాదేవీలు లేని కారణంగా బ్యాంకు అకౌంటు మనుగడలో లేదని ఈ-కేవైసీ చేయించిన తర్వాతే నగదు తీసుకోవడానికి వీలవుతుందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. రద్దీగా ఉన్న క్యూ లైన్‌లో గంటల కొద్ది నిలబడి ఉండటంతో సదరు వృద్ధురాలు నీరసించి సొమ్మసిల్లి కింద పడిపోయింది. ఆందోళన చెందిన బ్యాంకు సిబ్బంది వృద్ధురాలికి ఓ పక్కన కూర్చోబెట్టి మజ్జిగ తాపించారు. అనంతరం యుద్ధప్రాతిపదికన ఈకేవైసీ అప్‌లోడ్ చేయించి పింఛన్ సొమ్మును వృద్ధురాలికి అందజేశారు.

ఖాతాల్లో జమ కాని పింఛన్

లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ సొమ్మును జమ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పింఛన్ రాజకీయంలో ఇదంతా ఓ భాగమేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉండగా చాలామంది వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ సొమ్ము ఖాతాల్లో జమకాకపోడంతో బ్యాంకులకు వచ్చి నిరాశగా వెనుతిరిగిపోతున్నారు. మిగిలిన వారికి శనివారం ఖాతాలో జమ అవుతాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఒక్క కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో 133 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 34,044 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం నుంచి ప్రతి నెల రూ.10.31 కోట్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో వేలమందితో బ్యాంకులు కిక్కిరిసి కనిపిస్తున్నాయి.



ఆలూరులో మీసేవా కేంద్రం వద్ద వృద్ధుల పడిగాపులు

వృద్ధులకు బ్యాంకు కష్టాలు

చాలామంది వృద్ధుల బ్యాంకు ఖాతాలు యాక్టివేట్‌లో లేవు. కొందరికి బ్యాంకు ఖాతాలే లేవు. ఐదేళ్లుగా పింఛన్లు చేతికే అందిస్తుండటంతో బ్యాంకు ఖాతాతో వారికి పనిలేకుండా పోయింది. అంతేకాకుండా చాలామంది తమ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ కూడా ఉంచడం లేదు. దీంతో ఒకవేళ పింఛన్ నగదు జమ చేస్తే అందులో బ్యాంకు సిబ్బంది కోత విధిస్తున్నారు. మరో వైపు గ్రామాల్లో ఉండే పండుటాకులు పట్టణాలు, మండల కేంద్రాల్లోని బ్యాంకుల వద్ద గంటలకొద్దీ బారులు తీరాల్సి వస్తోంది. చాలామంది నిరక్షరాస్యులే కావడంతో నగదు తీసుకోవడంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికమందికి బ్యాంకు డెబిట్ కార్డులు లేవు. దీంతో వారు ఓచర్(కాగితాల)ను భర్తీచేసి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో లబ్ధిదారులు పింఛన్ సొమ్మును తీసుకోవాలంటే గంటల కొద్దీ సమయం పడుతోంది.



ఆదోనిలోని మినీ బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు



పాములపాడులో వేచి ఉన్న వృద్ధులు



ఆదోని స్టేట్ బ్యాంకులో వృద్ధులు ఇలా..



చాగలమర్రి ఎస్‌బీఐ వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

తిరిగి తిరిగి చచ్చిపోతున్నాం



గ్రామాల్లో పింఛన్లు అందజేయకుండా బ్యాంక్ ఖాతాల్లో వేశారు. ఎర్రటి ఎండలలో ప్రయాణం చేసి వేరే గ్రామానికి వెళ్లి పింఛను తీసుకోవాల్సి వస్తోంది. ఈ ఎండలకు తిరగలేక సచ్చిపోతున్నాం.

- రాములమ్మ, ఎర్రగూడూరు

అనారోగ్యంతో ఎలా వచ్చేది



అనారోగ్యంతో బాధపడుతూ ఈ ఎండలో పింఛన్ డబ్బులకోసం వేరే గ్రామంలోని బ్యాంక్‌కు వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేయాలి. ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదు.

-చిన్నంకులు, మిట్టకందాల గ్రామం

ఇబ్బంది పెట్టడం తగదు



పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టడం తగదు. బ్యాంకుకు వెళ్తే మూడు రోజుల నుంచి తిప్పుకుంటున్నారు. బ్యాంకులకు వెళ్లాలంటే సమయం వృథా అవుతోంది. పైగా ఎండలు ఎక్కువగా ఉన్నాయి. గత నెల సచివాలయం వద్ద పింఛన్ ఇచ్చినట్లుగా ఈనెల కూడా పంపిణీ చేసి ఉంటే బాగుండేది.

- దస్తగిరి, చాగలమర్రి

పింఛన్ కోసం అవస్థలు



మాది చింతలచెరువు గ్రామం. పింఛన్ కోసం చాగలమర్రిలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు ఉదయం 10 గంటలకు వచ్చాను. ఈనెలలో వృద్ధులను ఎండలో తిప్పుతూ ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం. మూడు రోజులు తిరిగినా పింఛన్ అందలేదు.

-వెంకట్రామిరెడ్డి, చింతలచెరువు

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(న్యూసిటీ), మే 3: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి కోసం ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, రామాంజనేయులు, బాబయ్య పాల్గొన్నారు.

అతుల్‌కుమార్ అంజన్ మృతి తీరని లోటు

కర్నూలు(న్యూసిటీ), మే 3: సీపీఐ జాతీయ కార్యదర్శి, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ మృతి రైతు ఉద్యమాలకు తీరనిలోటని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో అతుల్‌కుమార్ అంజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, విద్యార్థి, యువజన సంఘం నాయకులు శ్రీనివాసులు, సోమన్న, శరత్ పాల్గొన్నారు.

'అభ్యుదయ సాహిత్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం'

కర్నూలు(కల్చరల్), మే 3: అభ్యుదయ సాహిత్యాన్ని ప్రోత్సహించడమే అభ్యుదయ రచయితల సంఘం లక్ష్యమని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్టీయూ భవన్‌లో, అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో, కలం ప్రహ్లాద అధ్యక్షతన అరసం నగర ప్రథమ మహాసభ, నగర శాఖ నూతన కమిటీ ఎంపిక, కవితా సంకలన ఆవిష్కరణ జరిగాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా విచ్చేసిన జేవీ కృష్ణయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ నూతన రచయితలను ముందుకు తీసుకుపోవడంలో అరసం ప్రముఖ పాత్ర పోషిస్తోందని అన్నారు. రచయితలు సామాజిక దృక్పథం కలిగి, ప్రజా సాహిత్యాన్ని సృష్టించడం వల్లనే ఆ సాహిత్యం చరిత్రలో నిలిచిపోతుందని, సమాజానికి కొంత ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేటి ఎన్నికల తీరుపై అరసం గుంటూరు జిల్లా శాఖ ప్రచురించిన 'ఎన్నికల భారతం' కవితా సంకలనాన్ని ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయురాలు రాణి లీలావతి పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ చంద్రమౌళికి ఆలపించిన ఎన్నికల గేయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి, డాక్టర్ ఆదివాని హనుమంతప్ప, ఎస్‌డీవీ అజీజ్, పుల్లా రామాంజినేయులు, కేసీ మల్లికార్జున, హసీనాబీ, సయ్యద్ జహీర్ అహ్మద్, ప్రమోద్ చక్రవర్తి, రాజా రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ

కర్నూలు(న్యూసిటీ), మే 3: అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల అధికారి ఎ. భార్గవతేజ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 శాతం ఈవీఎంలలో మాక్ పోలింగ్ నిర్వహించి వెయ్యి ఓట్లు వేసి ఈవీఎంల పారదర్శకతను నిర్ధారించామన్నారు. శని, ఆదివారాలు కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ నిర్వహిస్తామన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కు మార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఉన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

ఓర్వకల్లు, మే 3: తెలుగుదేశం పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి సూచించారు. శుక్రవారం ఓర్వకల్లులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

● మండలంలోని హుశేనాపురంలో టీడీపీ నాయకులు అన్వర్ బాషా ఆధ్వర్యంలో బస్టాండు సమీపంలోని కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె రాముడు, అభిమన్యుడు, షమీవుల్లా, షాలిమియా, షేక్షావలి, వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి జమీలా బేగం

కర్నూలు(అర్బన్), మే 3: తెలుగుదేశం పార్టీలో వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సయ్యద్ జమీలా బేగం చేరారు. శుక్రవారం కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ సమక్షంలో ఆమెతోపాటు 22వ వార్డుకు చెందిన మహిళలు, యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జమీలా బేగం మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో భగత్, అపర్ణ, తహేరా, రాణి, చిన్న ఉన్నారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు రామాంజనేయులు, మోయిన్ బాషా పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలి

కోడుమూరు, మే 3: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎల్లప్ప నాయుడు శుక్రవారం ఎస్ఐ బాలనరసింహులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వైసీపీ కార్యకర్తలు పట్టణంలోని ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటర్లు స్లిప్పులతోపాటు వాళ్ల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారని అన్నారు. వైసీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని చెప్పారు. కాబట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ తాలుకా అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నాగరాజు, గిడ్డయ్య పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

గూడూరు, మే 3: ముస్లిం మైనార్టీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. శుక్రవారం గూడూరులో పర్యటించిన ఆయన ముస్లింలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు ముస్లిం మైనార్టీ నాయకులు మన్సూన్‌బాషా, వాహిద్, రహిమాన్, ఇబ్రహీం, సులేమాన్, రఘూఫ్, అద్దు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

టీజీ భరోసా యాత్రలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



భరోసా యాత్రలో పాల్గొన్న తిక్కారెడ్డి, బీటీ నాయుడు, టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మే 3: చంద్రబాబు నాయుడుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో టీజీ భరత్ భరోసా యాత్రలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి టీజీ భరత్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన అన్ని వర్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అందరి జీవితాలు బాగుపడాలంటే రాష్ట్రానికి చంద్రబాబు పాలన ఎంతో అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్, కూటమి మ్యానిఫెస్టో రాష్ట్ర ప్రజల భవిష్యత్ పూర్తిగా మారబోతుందని పేర్కొన్నారు. ఈనెల 13న ఓటు అనే ఆయుధంతో జగన్ పార్టీ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలు ఐదేళ్ల పాటు నరకం చూశారని, ప్రజలు తెలుగుదేశం పార్టీ విజయాన్ని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి దాశెట్టి శ్రీనివాసులు, కౌశిక్, నాగేంద్ర సింగ్, శంకర్ సింగ్, విజయ్, అనూరాధ, చంద్రశేఖర్, ప్రవీణ్, వినోద్, సునీల్, మణిప్రకాష్, పుల్లయ్య నాయుడు, బషీరున్, సాయత్‌బీ, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, భవానీ శంకర్ పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా: టీజీ భరత్

కర్నూలు(అర్బన్): ముస్లింలకు అండగా ఉంటామని కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మాసుంబాషా దర్గా సమీపంలో 11వ వార్డుకు చెందిన వైసీపీ కార్పొరేటర్ ఫరాజ్ ఆలీఖాన్‌తోపాటు ఆయన సోదరుడు ఫైజల్ ఆలీఖాన్, మహిళలు, యువకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కార్పొరేటర్ ఫరాజ్ టీడీపీలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మహబూబ్ బాషా, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, జమీలా బేగం, నైషాద్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్పొరేటర్

పాణ్యంపై టీడీపీ జెండా ఎగరేద్దాం



గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 41వ వార్డు వైసీపీ నాయకులు

కల్లూరు, మే 3: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని పాణ్యంపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేద్దామని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో 41వ వార్డుకు చెందిన 50 కుటుంబాల వైసీపీ నాయకులు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రాముడు, బలరాముడు, జయసూర్యరాజు, రాజేష్, మద్దిలేటి ఉన్నారు.



28, 36వ వార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గౌరు జనార్దన్‌రెడ్డి

చంద్రబాబుతోనే అభివృద్ధి: గౌరు వెంకటరెడ్డి

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 34వ వార్డు సుంకులమ్మగుడి, నిర్మల్‌నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి, కల్లూరు క్లస్టర్ ఇన్‌చార్జి పియూ. మాదన్న, జవ్వాజి గంగాధర్‌గౌడ్, సుంకన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

గౌరు చరితను గెలిపించండి: గౌరు జనార్దన్‌రెడ్డి

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28 ,36వ వార్డు రాజీవ్ గృహకల్పలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబే గ్యారంటీ ఇవ్వగలరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్. తిరుమలేశ్వరరెడ్డి, చిన్నబీచుపల్లి, శేఖర్ జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పేదల బతుకుల్లో వెలుగు

కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



మునగాల, మల్లాపురం ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి



సి.బెళగల్: ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

గూడూరు, మే 3: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే పేదల బతుకుల్లో వెలుగులు వస్తాయని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి బొగ్గుల దస్తగిరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కోడుమూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధం: విష్ణు

వైసీపీని ఇంటికి పంపేందుకు జనం సిద్ధమయ్యారని కోడుమూరు టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో కర్నూలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, కోడుమూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుకుంద రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు, దండు సుందరరాజు, రేమట వెంకటేశ్వర్లు, మునగాల కుంటిచేతి గోపాల్, రామచంద్రుడు, బోయ హనుమంతు, అంజనేయులు, రవిప్రకాష్, షద్రక్, అల్లిసా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన శని జగన్

సి.బెళగల్: రాష్ట్రానికి పట్టిన శని జగన్ అని కోడుమూరు టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్దొడ్డి, కొండాపురం, ఇనగండ్ల గ్రామాల్లో మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ గిరిజోన్, ఎంపీటీసీలు ఈరన్నగౌడు, మల్లికార్జునగౌడు, కోడు మూరు, గూడూరు, సి.బెళగల్ టీడీపీ నాయకులు ఉన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం'

కర్నూలు(కల్చరల్): టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కోడుమూరు పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సతీమణి సుధారాణి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె నగర శివారు స్టాంటన్‌పురంలోని 40 వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆమె వెంట మాజీ సర్పంచులు ఆర్ మార్కండేయులు, ఆర్ సుమియన్, బీజేపీ నాయకురాలు గీతామాధురి, వీరభద్ర, మధు ఉన్నారు.



స్టాంటన్‌పురంలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి సతీమణి సుధారాణి

నగదుకు పత్రాలు పక్కాగా ఉండాలి



విచారణ జరుపుతున్న గ్రీవెన్స్ కమిటీ సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలో భాగంగా నగదును తరలించే క్రమంలో పత్రాలు పక్కాగా ఉంచుకోవాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ జిల్లా నోడల్ అధికారి జి. నాసరరెడ్డి అన్నారు. గత నెల 22న ఎమ్మిగనూరుకు చెందిన తుంటపురం కార్తీక్ వద్ద చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా నిర్దీత పరిమితికి మించిన నగదు రూ.89,500 తీసుకెళ్తున్న తరుణంలో ఎస్ఎస్‌టీ అధికారులు సీజ్ చేశారు. అనంతరం ఆ నగదును ఆదోని ఉపఖజానా కార్యాలయంలో జమచేశారు. శుక్రవారం జిల్లా పరిషత్‌లో గ్రీవెన్స్ కమిటీ హెడ్ జి.నాసరరెడ్డి, కన్వీనర్ జిల్లా ఆడిట్ అధికారి కే.రమేష్‌బాబు, సభ్యులు డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీస్ బి.రామ చంద్రరావు విచారించారు. విచారణలో సీజ్ చేసిన నగదు వాస్తవంగా డా.కార్తీక్ వైద్యం కోసం వచ్చిన రోగుల నుంచి ఓపీ ఫీజ్‌గా వచ్చినట్లు పత్రాలను సమర్పించారు. పత్రాలు ఆధారంగా నిర్ధారించుకుని స్వాధీనం చేసుకున్న నగదును విడుదల చేయాలని ఎస్ఎస్‌టీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాసరరెడ్డి మాట్లాడుతూ నగదును ఎవ్వరైనా తీసుకెళ్తుంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే స్వాధీనం చేసుకోవాలని ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందానికి సూచించారు.

వైభవంగా తిమ్మగురుడి రథోత్సవం

గూడూరు, మే 3: పట్టణంలో తిమ్మగురుడు స్వామి ప్రారంభ రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గూడూరులోని తిమ్మగురుడు స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా జైలు ములాఖత్ వేళల్లో మార్పు

కర్నూలు(లీగల్), మే 3: వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లా జైలులోని ఖైదీలతో వారి బంధువులు మాట్లాడుకునేందుకు నిర్వహించే ములాఖత్ వేలల్లో మార్పులు చేసినట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ ఘనే నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ములాఖత్ వేళలను మార్చినట్లు ఆయన తెలిపారు. ఖైదీల కుటుంబ సభ్యులు ఈ సమయవేళలు పాటించాలని ఆయన ప్రకటనలో కోరారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కర్నూలు(అర్బన్), మే 3: క్రైస్తవులకు క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో మేనిఫెస్టో విడుదల చేయం హర్షణీయమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాస్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్ అధ్యక్షులు దువ్వూరి భాస్కర్, శ్యామ్, డేవిడ్, క్రిష్టియన్ సెల్ నాయకులు పాల్గొన్నారు. కూటమి ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మద్దిలేటి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు జేమ్స్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.వి. హనుమంతరావు చౌదరి, సురేష్, హేస్సేన్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

కర్నూలు, మే 3: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో సుంకేసుల రోడ్డులో జి. సింగవరం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర (30) అనే వ్యక్తి మృతి చెందాడు. సీ బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన 20 మంది దాకా కూలీలు టాటా ఏసీ వాహనంలో కర్నూలు వస్తున్నారు. సింగవరం సబ్‌స్టేషన్ సమీపంలో డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో ఆటో అక్కడికక్కడే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో వెనుక ఉన్న సుమారు 20 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. రవీంద్ర అనే వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన వారందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు రవీంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మే 3: వ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన శుక్రవారం తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు.

పెద్దాసుపత్రిలో కరెంటు కష్టాలు

● ఏఎంసీలో అత్యవసర రోగుల నరకం
● వైద్య పరీక్షలకు అంతరాయం..
● కంటి ఆసుపత్రిలో కూడా నిలిచిన కరెంటు

కర్నూలు(హాస్పిటల్), మే 3: కర్నూలు గవర్నమెంట్ హాస్పెటల్‌లో శుక్రవారం సాంకేతిక సమస్య వల్ల విద్యుత్ అంతరాయం కలిగింది. కంటి ఆసుపత్రిలో దాదాపు 2 గంటలు విద్యుత్ లేకపోవడంతో ఆపరేషన్లకు ఇబ్బంది కలిగింది. దాదాపు 17 కేసులను బ్యాకప్ బ్యాటరీను వాడటంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. కర్నూలు పెద్దాసుపత్రిలో సరిగ్గా మధ్యాహ్నం 12.10 గంటలకు కరెంటు తీసేసి మధ్యాహ్నం 1.10 గంటలకు పునరుద్ధరించారు. అత్యవసర రోగులకు గుండెకాయలాంటి ఏఎంసీలో విద్యుత్ అంతరాయంతో రోగులు విలవిల్లాడారు. ఏఎంసీకి జనరేటర్ సౌకర్యం లేకపోవడం అత్యవసర రోగులు, ముఖ్యంగా వెంటిలేటర్‌పై ఉన్న రోగులు అల్లాడిపోయారు. ఏఎంసీలో 38 మంది రోగులు చికిత్స పొందుతుండగా.. ఇందులో 12 మంది వెంటిలేటర్ పై ఉండటం ఈ సమయంలో కరెంటుపోవడం వైద్యుల్లో ఆందోళన కలిగించింది. ఏఎంసీకి జనరేటర్ సౌకర్యం కల్పించకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. అలాగే 1 గంటసేపు రేడియాలజీ విభాగంలో పరీక్షలు నిలిచిపోయాయి. దీనిపై కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రతిపాదనలు పెట్టామని, అది వస్తే సమస్య తీరుతుందన్నారు.



క్యాజువాల్టీలో కరెంటు లేకపోవడంతో మొబైల్ లైట్ వెలుతురులో విధులు నిర్వహిస్తున్న నర్సులు

ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారిగా సరోజనమ్మ

కర్నూలు(లీగల్), మే 3: కర్నూలు ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారిగా ఎన్. సరోజనమ్మ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా ఈ కోర్టుకు ఇన్‌చార్జి న్యాయాధికారిగా కర్నూలు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా జి.వందన విధులు నిర్వహించే వారు. కొత్తగా నియమితులైన సరోజనమ్మ బొబ్బిలి కోర్టులో న్యాయాధికారిగా పని చేసేవారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఈమెకు గత వారంలో కర్నూలుకు బదిలీ చేయడంతో ఈమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), మే 3: మైక్రో అబ్జర్వర్లు విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా జనరల్ అబ్జర్వర్ జాఫర్ అన్నారు. శుక్రవారం స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో అబ్జర్వర్ల సమక్షంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ జాఫర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎక్కడైన పొరపాట్లు జరుగుతున్నట్లు అనిపిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఉండే మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్‌కు కళ్లు లాంటి వారన్నారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు.

నీటికోసం పంచాయతీ కార్యాలయం ముట్టడి

హొళగుంద, మే 3: స్థానిక కొండయ్య నగర్‌లో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. కుళాయి నీరు సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఖాళీ బిందెలతో రోడ్డు పై దర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా, నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు లక్ష్మణ్ణ, హనుమంతు, ఖాలింగ, మల్లయ్య, లక్ష్మీ, మల్లమ్మ పాల్గొన్నారు.

లింగాయత్‌లందరూ టీడీపీ గెలుపు కోసం పోరాడాలి

తుగ్గలి, మే 3: రాష్ట్రంలోని లింగాయత్‌లందరూ టీడీపీ గెలుపు కోసం పోరాడాలని టీడీపీ వీరశైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు కౌశిక్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి తదితర గ్రామాల్లోని వీరశైవ లింగాయత్‌ల ఇంటింటికి వెళ్లి టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లను అవమానించిన సీఎం జగన్‌కు బుద్ధి చెప్పే అవకాశం ఉందని, అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ కొమ్మే వెంకటేశ్, లక్ష్మీనారాయణ చౌదరి, వరప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో నిఘాతో ఉండాలి


మాట్లాడుతున్న గిరిమల్లేశ్‌గౌడ్

దేవనకొండ, మే3: 13న జరగనున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో బూతు కన్వీనర్లు నిఘాతో ఉండాలని టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ తనయుడు గిరిమల్లేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని బూతుస్థాయి కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. అధికారం దక్కించుకునేందుకు వైసీపీ అనేక అడ్డదారులు తొక్కేఆవకాశం ఉందని, బూతుస్థాయి కన్వీనర్లు జాగ్రత్తగా వ్యవహరించి, టీడీపీ విజయానికి కృషిచేయాలని సూచించారు.

జగన్ నాటకాలను ప్రజలు నమ్మరు


బంటనహాళ్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చిప్పగిరి, మే 3: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వృద్ధుల శాపం తప్పదని, పెన్షన్ బ్యాంకుల్లో వేసి వృద్ధులను బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారని జడ్పీటీసీల రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు, మండల ఇన్‌చార్జి మల్లికార్జున గౌడ్, పోతురాజు, రాముడు, సర్పంచు సుశీలమ్మ అన్నారు. శుక్రవారం చిప్పగిరి మండలంలోని బంటనహాలు, గుమ్మనూరు, ఖాజీపురం, కొట్టాల గ్రామాల్లో విస్తృత పర్యటన చేశారు. ఓట్ల కోసం జగన్ చేసే నాటకాలను వృద్ధులు నమ్మరన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.4000, వికలాంగులు రూ.6వేలు పెన్షన్ ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పోతురాజు రాముడు, గోవిందు, పెద్దన్న, కొండా రాముడు, నెట్టప్ప, తిమ్మయ్య, సోమశేఖర్ నాయుడు, సతీష్, శీన, సర్పంచులు కొండా పురుషోత్తం, ఎల్లంకి నాగరాజు పాల్గొన్నారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.. ప్రజల కన్నీటి కష్టాలు

కనిపించలేదా?



ఎరిగేరి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, హాజరైన గ్రామస్థులు

- ఎమ్మెల్యే నిర్లక్షంపై నిప్పులు చెరిగిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- కౌతాళం మండలంలో విస్తృత ప్రచారం
- రచ్చుమర్రిలో సోదరుల ఇంటింటి పర్యటన
- మాలపల్లిలో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

కౌతాళం, మే 3: "ప్రజల ఓట్లతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.. కనీసం గ్రామాల్లో ప్రజల కన్నీటి కష్టాలు కనిపించలేదా? ఏ గ్రామానికి వెళ్లినా గుక్కెడు నీటి కోసం తల్లడిల్లుతున్నారు.. దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు ఏ మంచిపనైనా చేశారా?" అంటూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి విరుచుకుపడ్డారు. ప్రజలు వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలతో విసిగిపోయారని, మరో 10 రోజుల్లో ఆ పార్టీ నేతలను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఎరిగేరి, తోవి, బదినేహల్, కుంటనహల్, ఉప్పరహల్, రౌడూరు, బాపురం, వీర్లదిన్నె, డమ్మూలదిన్నె, అగసలదిన్నె, లింగాలదిన్నె, కాత్రికి గ్రామాల్లో ఆయన కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేతో పాటు అతని అనుచరులు నియోజకవర్గంలో ఇసుక దోపిడి చేసి కోట్లకు పడగలెత్తి గ్రామాల రోడ్లను గుంతలమయంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నబసప్ప, అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, కోత్రేష్‌గౌడ్ సురేష్‌నాయుడు, కోత్రేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, జనసేనా నాయకుడు రామాంజనేయులు, బీజేపీ నాయకుడు రామకృష్ణ, నాయకులు నీలకంఠరెడ్డి, కురువ వీరేష్, శ్రీరాములు ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

అన్న గెలుపు కోసం..

మంత్రాలయం : టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి మాధవరం మాజీ సర్పంచు రఘునాథరెడ్డి రచ్చుమర్రి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన అన్నను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసి చూపుతామని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు రాజారెడ్డి నాగన్న, బొజ్జప్ప, వెంకట్రాముడు, శ్రీనివాసులు, హంశేనీ తదితరులు పాల్గొన్నారు.

మాలపల్లి నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నివాసమైన మాధవరంలో జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్ ఆధ్వర్యంలో రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డిలు పార్టీ కండువాలు వేసి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. నాగరాజు, సాయికుమార్, శ్రీరాములు, ఈశ్వర్, పింజారి హుశేన్‌బాషా, తాయప్ప, ఆటో మోహన్ మాట్లాడుతూ వైసీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థానం లేదని, తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.


రఘునాథ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

బాలనాగిరెడ్డి దగ్గర బీసీలు ఉత్సవ విగ్రహాలే

● పదవులు ఇచ్చినా.. పెత్తనమంతా వారిదే : మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య

మంత్రాలయం, మే 3: మూడుసార్లుగా బీసీల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి బీసీలకు పదవులు ఇచ్చి ఉత్సవ విగ్రహాలుగా చూశారని పెత్తనమంతా వారిదేనని మాజీ జడ్పీటీసీ, సీనియర్ టీడీపీ నాయకులు మాలపల్లి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం తన నివాసంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలనాగిరెడ్డికి 30 ఏళ్లుగా నమ్మిన బంటుగా, ప్రధాన అనుచరునిగా కొనసాగానని, మంత్రాలయం టికెట్ వాల్మీకికి రావడంతో టీడీపీలో చేరితే.. లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా వాల్మీకి రాఘవేంద్రరెడ్డికి, కురువ బీసీ సామాజికవర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజుకు టికెట్లు ఇచ్చిందని, బీసీలంతా ఏకమై ఉత్సవవిగ్రహాలు కాదని, పెత్తనం మేమే చెలాయించేందుకు రాజ్యాధికారం కావాలని పోరాడుతున్నామని పేర్కొన్నారు. గురెడ్డి భీమిరెడ్డి తనపై లేనిపోని మాటలు, అసత్యాలు మాట్లాడటం మానుకోవాలని, లేకపోతే నాలుక తెగకోస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు చంద్ర, వీరేష్, లక్ష్మన్న, రంగస్వామి, గువ్వల తాయప్ప, బుడ్డన్న, మాల తాయన్న, బసవరాజు, హుశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



భూములు కొట్టేయాలనే రీ సర్వే

- టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి
- ఐదేళ్లలో రోడ్లపై పిడికెడు మట్టివేశారా?
- గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో ప్రచారం
- 560 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక
- పట్టణ వార్డుల్లో టీడీపీ శ్రేణుల పర్యటన




పెసలదిన్నె ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, హాజరైన జనం, బీవీ సమక్షంలో పట్టణంలోని 31వ వార్డు ప్రజలు

ఎమ్మిగనూరు/రూరల్ : రీ సర్వేల పేరుతో రైతుల భూములను వైసీపీ నాయకులు కొట్టేయాలని చూస్తున్నారని టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం పెసలదిన్నె, గార్లదిన్నె, పార్లపల్లి, గువ్వలదొడ్డి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో తిరిగి ప్రజలను కలుసుకొని ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పాసుపుస్తకాలపై రైతుల ఫొటోలు కాకుండ ఏకంగా సీఎం జగన్ ఫొటో వేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరి ఆస్తిపై ఎవరి ఫొటో వేసుకుంటారని మండిపడ్డారు. మరోసారి జగన్ అధికారంలో వచ్చాడంటే రైతులు భూములు కోల్పోవాల్సిందేనని, ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని కోరారు.

ఐదేళ్లలో రోడ్లపై పిడికెడు మట్టి వేశారా?

ఎమ్మిగనూరు : ఐదేళ్లుగా రాష్ట్ర అభివృద్ధిని సర్వనాశనం చేశారు.. కనీసం గుంతలు పడిన రోడ్లపై పిడికెడు మట్టిఅయినా వేశారా అంటూ బీవీ జయనాగేశ్వరరెడ్డి వైసీపీ నేతలను నిలదీశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని 31వ వార్డు, గోనేగండ్ల మండలం తిప్పనూరు, ఎన్నెకండ్ల, ఎమ్మిగనూరు మండలం ఏనుగబాల, కోటేకల్లు గ్రామాలనుంచి దాదాపు 560 కుటుంబాలు టీడీపీలో చేరారు. బీవీ ఇంటిదగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 31వ వార్డునుంచి దాదాపు 400 కుటుంబాలు పెద్దఎత్తున ఊరేగింపుగా బీవీ ఇంటిదగ్గరకు చేరుకొని వార్డు ఇన్‌చార్జి దేవేంద్ర, నాయకులు శ్రీనివాసులు, పట్టా నాగరాజుల ఆధ్వర్యంలో బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఆయా వార్డు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో ముమ్మర ప్రచారం : పట్టణంలోని 34వార్డుల్లో ఆయా వార్డు ఇన్‌చార్జీలు, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. 21వ వార్డులో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, 5వ వార్డులో టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, ఆరో వార్డులో రంగస్వామి గౌడ్, 9వ వార్డులో కటారి రాజేంద్ర, 16వ వార్డులో ముల్లా కలీముల్లా, 17వ వార్డులో జయన్న, 27వ వార్డులో తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణతేజ నాయడు, ఎస్సీ కాలనీలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుందరరాజు బీవీ జయనాగేశ్వరరెడ్డి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.

నందవరంలో విస్తృత ప్రచారం

నందవరం: మండలంలోని గురుజాల, కనకవీడు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తిస్వామి, ధర్మాపురం గోపాల్, హాలహర్విలో రైస్ మిల్ నారాయణరెడ్డి, ముగతిలో భార్గవ్‌యాదవ్ ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రవేశ పెట్టబోయే సూపర్- 6 పథకాల గురించి వివరించారు.

వలస కుటుంబాలతో కేఈ ఆత్మీయ సమ్మేళనం

- టీడీపీని గెలిపించడం బాధ్యతగా తీసుకోవాలని పిలుపు
- నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల విస్తృత ప్రచారం


వలస కుటుంబాలతో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర

పత్తికొండ, మే 3 : నియోజకవర్గం పరిధిలోని తుగ్గలి, మద్దికెర, పత్తికొండ మండలాల నుంచి ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన వలస కుటుంబాలతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టీడీపీ రాష్ట్రనాయకుడు తుగ్గలి నాగేంద్రతో కలసి హైదరాబాద్‌లో నివసిస్తున్న 1500 కుటుంబాలను కలసి మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాల వెనుకబాటుకు గురైందన్నారు. మే 13 జరిగే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తేవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో వలసల నివారణ కోసం అందుబాటులో ఉన్న హంద్రీనీవా కాలువద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకుసాగుతామన్నారు. తుగ్గలినాగేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న యువకుడు, విద్యావేత్త కేఈ శ్యాంబాబుకు ఓటువేసి గెలిపించుకుందామని కోరారు.

ఘనస్వాగతం పలికిన వలస కుటుంబాలు..

ఆత్మీయసమ్మేళనానికి హాజరైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు హైదరాబాద్‌లో వలస కుటుంబాల సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయనతోపాటు వెళ్లిన తుగ్గలినాగేంద్ర, ఇతర టీడీపీ నాయకులను ఆత్మీయంగా పూలమాలతో సత్కరించారు. కేఈ శ్యాంబాబుతో ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు.

సోదరుడు కేఈ హరీష్ ప్రచారం

పత్తికొండ : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఈ శ్యాంబాబును గెలిపించాలని కోరుతూ ఆయన సోదరు కేఈ హరీష్ పట్టణంలోని 19వార్డులో ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులుగౌడ్, బీటీ గోవిందు, శ్రీకాంత్‌చౌదరిలతోపాటు యువనాయకులు ఆయనతోపాటు ప్రచారంలో పాల్గొన్నారు.

మద్దికెరలో ప్రచారం

మద్దికెర : టీడీపీ ఇన్‌చార్జి కేఈ దివాకర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ రాజన్న యాదవ్, టీడీపీ మండల కార్యదర్శి ధనుంజయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వెల్దుర్తి మండంలో ఇంటింటి ప్రచారం

వెల్దుర్తి : మండలంలోని బాలాపురం, సర్పరాజపురం, మల్లెపల్లె గ్రామాలలో టీడీపీ నాయకులు కేఈ. నిఖిలేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడు, జయరాముడు సమక్షంలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకొని తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు బలరాంగౌడు, కృష్ణ, రామచంద్రుడు, రమణరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పైలట్‌గా వెళ్లలేదట.. ఓవర్‌టేక్ చేశాడట!

- కోడ్ ఉల్లంఘనపై ఎస్పీకి క్రిష్ణగిరి ఎస్ఐ వివరణ
- అధికార పార్టీకి మద్దతుగా పని చేస్తున్నాడని ఎస్ఐపై ఆరోపణలు


ఎమ్మెల్యే శ్రీదేవి కాన్వాయ్ ముందు వెళ్తున్న ఎస్ఐ వాహనం

పత్తికొండ, మే 3 : ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్తుండగా బందోబస్తులో ఉన్న తాను కాన్వాయ్ వాహనాలను ఓవర్‌టేక్ చేసి వెళ్లానని పైలట్ వాహనంగా వెళ్లలేదని క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

ఈ ఎస్ఐ పై అధికారపార్టీకి మద్దతుగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు ముందు నుంచి ఉన్న విషయం తెలిసిందే. తాజాగా రెండురోజులక్రితం (గురువారం) క్రిష్ణగిరి మండలం అమకతాడులో ప్రచారం ముగించుకుని వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి కాన్వాయ్‌కు పైలట్ వాహనంగా వెళ్లి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి కోడ్‌ఉల్లంఘనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆయన ఎమ్మెల్యే కాన్వాయ్‌కు పైలట్‌వాహనంగా వెళ్లిన వీడియో సోషల్‌మీడియా వైసీపీ గ్రూపుల్లోనే వైరల్ అయ్యింది. ఈ విషయంపై టీడీపీ నాయకులు పత్తికొండ ఆర్వో రామలక్ష్మికి ఫిర్యాదు చేయడంతో సంఘటనపై విచారణచేసి నివేదికలు ఇవ్వాలని డీఎస్పీకి ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే వాహనానికి పైలట్‌గా వెళ్లడంపై క్రిష్ణగిరి ఎస్ఐపై జిల్లా ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం. జిల్లా కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని చెప్పడంతో తాను బందోబస్తులో భాగంగా కాన్వాయ్‌వాహనాలను ఓవర్‌టేక్ చేశానని, పైలట్ ఇవ్వలేదని చెప్పడంతో.. ఓవర్‌టేక్ కోడ్‌ఉల్లంఘన పరిధిలోకి రాదని జిల్లా అధికారులు ఎస్ఐపై చర్యలుచేపట్టకుండా పంపినట్లు తెలిసింది. ఈ విషయంపై పత్తికొండ ఆర్వో రామలక్ష్మిని వివరణకోరగా పోలీస్ శాఖ నుంచి తమకు విచారణ నివేదికలు అందలేదని చెప్పారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

- టీడీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్
- ఆస్పరి మండలంలో విస్త్రత ప్రచారం
- ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్న గ్రామస్థులు


పుటకలమర్రిలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న వీరభద్రగౌడ్, ప్రచారం చేస్తున్న దృశ్యం


వీరభద్రగౌడ్‌కు ఘనంగా స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

ఆస్పరి, మే 3: టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మార్చి ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని టీడీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ములుగుందం, బనవనూరు, కరుప్పల, పుట్టకలమర్రి, వలకొండ, అటేకల్, కైరుపల, డీ కోటకొండ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి గ్రామస్థులు ఘనస్వాగతం పలికి ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోలో ఉన్న అంశాలపై ప్రజలకు వివరించారు. ఒక ఓటు ఎమ్మెల్యే అభ్యర్థికి, మరొక ఓటు ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం వీరభద్రగౌడ్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గం ఎడారిగా మారిందన్నారు. నియోజకవర్గానికి సాగునీటి ప్రాజెక్టులైన వేదావతి, నగరడోణ రిజర్వాయర్లును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని జోహరాపురం గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి, మండలంలో ప్రతి ఇంటికి తాగునీరు సమస్యలేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు వెంకప్ప, వెంకట రాముడు, అమరేష్ గౌడు, కృష్ణయాదవ్, శేషాద్రి నాయుడు, శివన్న, నరసప్ప, రహంతుల్లా, శేశిరెడ్డి, సంజప్ప, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

లింగంపల్లిలో 60 కుటుంబాలు టీడీపీలో చేరిక

హొళగుంద : మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు వీరభద్రగౌడ్ తమ్ముడు రాజాగౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు ఈరన్న, హనుంమంత రాయుడు, శేషగిరి, రామన్న పాల్గొన్నారు.